## జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు
### సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూన్ 1, (ప్రభాతవార్త) :** శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుండి 30 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలిపారు.కావున సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఇట్టి విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ గారు సూచించారు.అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## తడిసిన ధాన్యం పేరిట క్వింటాళ్ల కొద్ది కోత
### రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలి..ప్రజావాణిలో వినతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లులో దిగుమతి అయిన తర్వాత మిల్ యజమాని 15 క్వింటాళ్లు తగ్గించారని ఇద్దరు రైతులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.వివరాలు ఇలా ఉన్నాయి. చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన శనిగరం నర్సింలు 140 బస్తాలకు 59 క్వింటాళ్లు కొనుగోలు కేంద్రం వద్ద కాంట పెట్టగా మిల్లుకు వెళ్లే సరికి ధాన్యం తడిసినదని మద్దూరు శ్రీ రామలింగేశ్వర రైస్ మిల్లు యజమాని 8 క్వింటాళ్లు కట్ చేశారని తెలిపారు. అలాగే శనిగరం శ్రీకాంత్‌కు చెందిన 149 బస్తాలకు 59 క్వింటాళ్ల 60 కిలోలు మిల్లులో దిగుమతి అయిన తర్వాత తడిసిన ధాన్యం పేరిట 7 క్వింటాళ్లుకట్ చేశారని రైతు కలెక్టర్‌కు విన్నవించారు. ధాన్యం కొనుగోలు చేసి దిగుమతి చేసుకున్న తర్వాత తడిసిన ధాన్యం పేరిట కోత విధించిన రైస్ మిల్లు యజమానిపై చర్య తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.



నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో మంత్రి దామోదర్ రాజనర్సింహా

## రాష్ట్రంలో నర్సింగ్ విద్యకు ప్రాధాన్యం
### మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, జూన్ 1, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నర్సింగ్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సోమవారం అందోలు శివారులోని నర్సింగ్ కళాశాలను, హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ కళాశాలను హాస్టల్‌ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. నర్సింగ్ విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎడ్యుకేషన్ బలోపేతం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నర్సింగ్‌కాలేజీ విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. కళాశాలలో వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ పాండు, మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## 'పర్యావరణ పనితీరు పురస్కారం' లభించడం హుస్నాబాద్‌కు గర్వకారణమని
### మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం

**హుస్నాబాద్ రూరల్, జూన్ 1, ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి టిజిపిసిబీ ప్రకటించిన ఉత్తమ 'పర్యావరణ పనితీరు పురస్కారం' హుస్నాబాద్ మున్సిపాలిటీకి లభించడం గర్వకారణమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హుస్నాబాద్, సూర్యాపేట మున్సిపాలిటీలు మాత్రమే ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక కావడం విశేషమన్నారు. వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య పరిరక్షణ, హరితాభివృద్ధి, పర్యావరణ సంరక్షణ కార్యక్రమాల అమలులో మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా చేసిన కృషికి ఈ అవార్డు నిదర్శనమన్నారు. ఈ పురస్కార ప్రదానోత్సవం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరగనుంది. అవార్డును మున్సిపాలిటీ ప్రతినిధులు అందుకోనున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ చేపట్టిన కార్యక్రమాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం ఆనందదాయకమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛంద సంస్థలు, అభినందించారు. భవిష్యత్తులోనూ పరిశుభ్రత, హరితాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో హుస్నాబాద్‌ను రాష్ట్రానికి ఆదర్శ మున్సిపాలిటీగా నిలబెట్టేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి
### సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ...అడవులు వన్య ప్రాణుల సంరక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 12 వరకు అటవీశాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 1 నుంచి 12 వరకు నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో అటవీశాఖ అధికారి పద్మజారాణితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. అవగాహన కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములై పర్యావరణ పరిరక్షణ, అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలన్నారు. అటవీశాఖ అధికారులు పర్యావరణ పరిరక్షణలో అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డిఆర్వో నాగరాజమ్మ, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి...**
**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.126 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా అదనపు లక్ష్మీ కిరణ్, ఎస్డిసిలు వరలక్ష్మీ, సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం
### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూన్ 1, ప్రభాతవార్త**
పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో పర్యావరణ అవగాహన, ప్రకృతి సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అటవీశాఖ అధికారితో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్ కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యా సంస్థలలో క్విజ్ పోటీలు, పర్యావరణ అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ అవగాహన సదస్సులు, ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనమహోత్సవం, అధిక సాంద్రతతో మిశ్రమ మొక్కల నాటకం, గృహావసర మొక్కల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే మంజీరా వన్యప్రాణి అభయారణ్యం, కమలాపూర్ సరస్సు ప్రాంతాల్లో ప్రకృతి సందర్శన కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా పర్యావరణ హిత ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో విస్తృత స్థాయిలో మొక్కల నాటడం, అటవీ అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మంజీరా పర్యావరణ విద్యా కేంద్రం, అటవీ నర్సరీ, వనదర్శిని కేంద్రాలకు ఎక్స్‌పోజర్ విజిట్లు నిర్వహించి ప్రకృతి, జీవ వైవిధ్య పరిరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. జూన్ 12న జరిగే ముగింపు కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు సేవలందించిన స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, పాఠశాలలకు, వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతని, జిల్లాలో ప్రజలు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశం అనంతరం పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం కోసం కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

**చెత్తను ఇళ్ల వద్దనే వర్గీకరించండి...**
**చౌటకూర్ జూన్ 1 ప్రభాతవార్త**
తడి చెత్తపొడి చెత్తను ఇళ్ల వద్దనే వర్గీకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం సర్పంచులు, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులతో చౌటకూర్ రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. తడి చెత్తను కంపోస్టుగా వినియోగించడం, పొడి చెత్తను వేరుచేసి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని సూచించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డులను పూర్తి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. అన్నీ గ్రామ పంచాయతీలలో తప్పనిసరిగా డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకువచ్చి తక్షణమే వర్మీ కంపోస్టు ఎరువులను తయారుచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఎంపీడీవో శంకర్, ఎంపీవో సువర్ణ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచులు రామచంద్రారెడ్డి, జైపాల్నాయక్, బేగరి రాజు, కొత్తగడి సంధ్యారాణిమల్లికార్జున్లెడ్, చిన్నరోళ్ల పాటి అనసూయరాజశేఖర్, పామెనొల్ల అంజమ్మ, కుమ్మరి నవనీత అశోక్, వార్డుసభ్యులు పాల్గొన్నారు



హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయం

'వార్త' ఎఫెక్ట్
## ఎబిసిడి రాజకీయాలపై మంత్రి సీరియస్..!
### మున్సిపల్ పాలకవర్గం, సీనియర్ నేతలతో పొన్నం భేటీ
### ఎవరి బాధ్యతలు వారే నిర్వర్తించాలని సూచన

**హుస్నాబాద్ రూరల్, జూన్ 1, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపాలిటీలో 'ఏబీసీడీ రాజకీయం' సాగుతోందంటూ 'ప్రభాతవార్త'లో సోమవారం వెలుగులోకి వచ్చిన 'వార్త' హుస్నాబాద్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి సోమవారం ఉదయమే హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హుస్నాబాద్‌కు వచ్చి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, పార్టీ నాయకులతో క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. సమావేశంలో మున్సిపాలిటీ పరిపాలన, అభివృద్ధి పనులు, ప్రజాప్రతినిధుల పాత్ర, పార్టీ నాయకుల జోక్యం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల అధికారాలు, బాధ్యతలను గౌరవించాలని, ఎవరి పనులు వారే చేసుకోవాలని సూచనలు చేసినట్లు తెలిసింది. ఇటీవల మున్సిపాలిటీలో కొందరు ప్రభావశీల నాయకుల చుట్టూ పరిపాలన తిరుగుతోందనే ప్రచారం నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. పరిపాలనలో సమన్వయం,పారదర్శకత ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అందరూ కలిసి పనిచేయాలని మంత్రి సూచించినట్లు తెలిసింది. మంత్రి నిర్వహించిన ఈ సమావేశం తర్వాత హుస్నాబాద్ రాజకీయాల్లో నెలకొన్న చర్చలకు కొంతవరకు తెరపడుతుందా? లేక మరిన్ని పరిణామాలకు దారి తీస్తుందా? అనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# లింగంపల్లి చౌరస్తా నుంచి నాలా మీదుగా బ్రిడ్జి
### మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు



నాలాను పరిశీలిస్తున్న ఎంపి రఘునందన్‌రావు, అధికారులు

**రామచంద్రాపురం జూన్ 1 ప్రభాతవార్త**
జాతీయ రహదారిపై లింగంపల్లి చౌరస్తా నుంచి అమీన్‌పూర్ వరకు నేరుగా రోడ్ సౌకర్యం కావాలన్న ప్రజల ఆకాంక్షను త్వరలో సాకారం చేయనున్నామని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సోమవారం లింగంపల్లి చౌరస్తా వద్ద నాలా పనులను ఎంపీ రఘునందన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది చివరలో లింగంపల్లి చౌరస్తా నుంచి అమీన్‌పూర్ మీదుగా సుల్తాన్‌పూర్‌లోని రింగ్ రోడ్ ఎగ్జిట్ వరకు రేడియల్ రోడ్ నిర్మాణాన్ని తక్షణం చేపట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కన్నన్‌తో కలిసి స్థల పరిశీలన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నాలాగా మారిన చిన్నవాగులో ఆక్రమణలు తొలగించి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని అమీన్‌పూర్‌కు హైవే నుంచి నేరుగా రహదారి సౌకర్యం కల్పించాలని, భెల్ చౌరస్తాలో హైవే నుంచి రింగ్ రోడ్ వరకు నేరుగా రహదారి నిర్మాణం ప్రధాన లక్ష్యమని ఆయనకు వివరించిన తరువాత పలు దఫాలు అధికారులతో సమావేశమై దీర్ఘకాలంగా ఉన్న ఈ డిమాండ్ ను వందరోజుల్లో పూర్తి చేయాలని కమిషనర్ ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని, వెంటనే కార్యాచరణ ప్రారంభించారని అధికారులను ఆదేశించారని తెలిపారు. ఫలితంగా వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఈ రహదారి పూర్తయితే అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్, బొల్లారం ప్రాంతంలోని ప్రజలతో పాటు శేరిలింగంపల్లి వాసులకు రింగ్ రోడ్ ప్రయాణం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి చేసి, ఓట్లువేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, శేరిలింగంపల్లి బీజేపీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, దిశ కమిటీ సభ్యులు కాసాల సుధాకర్, బీజేపీ నాయకులు ఎడ్ల రమేష్, రాచమల్ల సంతోష్‌గౌడ్, వివిధ కాలనీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం
### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

**జోగిపేట్, జూన్ 1 ప్రభాతవార్త**
జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె.లలితాదేవి సూచించారు. సోమవారం ఆమె జోగిపేట్ ఏరియా ఆసుపత్రితో పాటు తాలేల్మ, నేరెడిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది విధులకు సమయానికి హాజరవుతున్నారా లేదా అనే అంశాన్ని అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాలను సందర్శించి పరిశీలించారు.ఆయా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మందుల నిల్వలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో, గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచరాదని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా, సకాలంలో అందించాలని, వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు సిబ్బంది సమయం పాలనపాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసు పత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు.

## చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి మృతి

**నర్సాపూర్, జూన్ 1, ప్రభాతవార్త :** చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఒక వ్యక్తి ప్రమాదవశాత్తున చెరువులో పడి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం గూడెంగడ్డ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం... గూడెంగడ్డ గ్రామానికి చెందిన అవంచ పోచయ (48) శనివారం రాత్రి చేపలు పట్టడానికి గ్రామ సమీపంలోని పెద్ద చెరువుకు వెళ్లాడు. చెరువులో వల విసురుతున్న సమయంలో అది కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయాడని తెలిపారు. రాత్రంతా అతను ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, సోమవారం ఉదయం చెరువులో తేలిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహం ఆవంచ పోచయ్యదిగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## భూ తగాదాతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య
### మృతుడి జేబులో సూసైడ్ నోట్

**చౌటకూర్ జూన్ 1 ప్రభాతవార్త :** భూ తగాదాతో ఒక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చౌటకూరులో జరిగింది. గ్రామానికి చెందిన పంతులు శ్రీశైలం 1991లో అదే గ్రామానికి చెందిన బుర్కల రాఘవులు వద్ద సర్వే నంబరు 6లో 6 గుంటల పట్టా భూమిని సాదా బైనామా(తెల్లకాగితం)పై కొనుగోలు చేశాడు. ఆ భూమి గ్రామానికి అనుకుని ఉండటంతో పంతులు శ్రీశైలం ఇంటిని నిర్మించుకుని, పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయించుకున్నాడు. అయితే, సాదా బైనామాపై కొనుగోలు చేసిన భూమిని శ్రీశైలం తన పేరున మార్చుకోలేదు. అనంతరం బుర్కల రాఘవులు మృతి చెందగా, ఆయన కుమారులు ఆ భూమి తమదని, తమ తల్లీ పేరున రికార్డుల్లో నమోదై ఉన్నదని, ఖాళీ చేయాలంటూ పలుమార్లు హెచ్చరిస్తూ, గొడవలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆదివారం పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా, శ్రీశైలం కుమారులు పంతులు గణేష్, రాజులు హాజరై తమ తండ్రి 36 ఏళ్ల క్రితం ఆ భూమిని కొనుగోలు చేశారని వాదించారు. న్యాయంగా శ్రీశైలంకే ఆభూమి దక్కుతుందని పెద్దలు చెప్పినప్పటికీ, బుర్కల రాఘవులు కుమారులు వినకపోవడంతో మొండికేశారు. కష్టపడి కొనుగోలు చేసిన భూమి తనకు దక్కకుండా పోతుందని కలత చెందిన పంతులు శ్రీశైలం ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం కావస్తున్నప్పటికీ, ఎంతకూ తిరిగి రాకపోవడంతో బంధువులు, వ్యవసాయ పొలాల వద్ద వెతికారు. సోమవారం ఉదయం వ్యవసాయ పొలాల వద్ద వెతుకుతుండగా, గ్రామానికి చెందిన పల్నాటి హరిశంకర్‌గౌడ్ వ్యవసాయ భూమిలో వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. కాగా, ఘటనా స్థలాన్ని తహసీల్దార్ నామాల కిష్టయ్య, రెవెన్యూ గిర్దావర్ ప్రమోద్ కుమార్, పుల్కల్ ఎస్ఐ నల్లా విశ్వజన్ను సందర్శించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టానికి సంగారెడ్డికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ తలెత్తకుండా గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. మృతుడు పంతులు శ్రీశైలం జేబులో సూసైడ్ నోట్ లభ్యమైంది. జేబులో దొరికిన సూసైడ్ నోట్‌ను ఎస్ఐ నల్లా విశ్వజన్ స్వాధీనం చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తాగుడుకు రెడ్ కార్పెట్.. పర్మిట్ రూమ్‌లో పాకశాల!
### నిబంధనలకు పాతరేసిన వైన్స్ మాఫియా... హాల్లోనే వంటలు, ఓపెన్ టాయిలెట్స్.. దుర్వాసనతో నరకం..

**రామాయంపేట, జూన్ 1, ప్రభాతవార్త :**
రామాయంపేటలో మద్యంషాపులకు అనుబంధంగా ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌లు కాస్తా బార్లుగా, హోటళ్లుగా మారిపోయాయి. నిబంధనలను తుంగలో తొక్కి, ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన మద్యం మాఫియా మాయాజాలం బట్టబయలవుతోంది. కోట్లు పెట్టి లైసెన్స్‌లు కొన్న వైన్స్ యజమానులు అడ్డదారుల్లో అదనపు ఆదాయం కోసం పాకులాడుతున్నారు. పట్టణంలో ఉన్న మూడు వైన్‌షాపులకు అనుబంధంగా నడుస్తున్న పర్మిట్ రూమ్‌లలోనూ నిబంధనలను పాతరేస్తున్నారు...

**హాల్లోనే వంటకాలు.. అదనపు దందా...**
పర్మిట్ రూమ్ అంటే కేవలం మద్యం తాగడానికి మాత్రమే. కానీ ఇక్కడ హాల్లోనే గ్యాస్ స్టవ్‌లు పెట్టి చికెన్, మటన్ వంటకాలు వండేస్తున్నారు. తాగుబోతులను ఆకర్షించేందుకు హోటల్ తరహాలో స్టార్టర్లు అందిస్తున్నారు. ఎక్సైజ్ చట్టం ప్రకారం ఇది పూర్తిగా నిషేధం.అయినా అధికారుల కనుసన్నల్లోనే దందా యథేచ్ఛగా సాగుతోందని ఆరోపణలున్నాయి.

**పర్మిట్ రూమ్ పేరిట లూటీ...**
ఒక్కో వైన్‌షాపు పర్మిట్ రూమ్ ద్వారా నెలకు సగటున రూ.50 వేలకు పైగా అక్రమంగా ఆర్జిస్తున్నట్లు సమాచారం. వంటకాల అమ్మకం, కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్‌పై కమీషన్.. ఇలా అన్ని దారుల్లోనూ సొమ్ము చేసుకుంటున్నారు. కోట్లు పెట్టి లైసెన్స్‌లు కొన్నామని, ఈ మాత్రం దండుకోకపోతే గిట్టుబాటు కాదని యజమానులు బాహాటంగానే చెబుతున్నారు.

**ఓపెన్ టాయిలెట్స్.. దుర్వాసనతో నరకం...**
ఇక పర్మిట్ రూమ్‌లలో పరిస్థితి మరీ దారుణం. కనీసం మరుగుదొడ్డి సౌకర్యం లేకుండా హాల్లోనే ఓపెన్‌గా మూత్రశాలలు ఏర్పాటు చేశారు. తాగిన మైకంలో ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడంతో దుర్వాసనతో అడుగు పెట్టలేని పరిస్థితి. ఖాళీ సీసాలు, చెత్తాచెదారం, ప్లేట్లు, ఎముకలు ఒకచోట కుప్పలుగా పోసి ఉంచడంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇదే హాల్లో కూర్చుని తిని, తాగే వినియోగదారులు రోగాలు కొని తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది.



రామాయంపేటలో పర్మిట్ రూమ్‌లలోనే యదేచ్ఛగా కిచెన్ ఏర్పాటుచేసుకున్న దృశ్యం

**మామూళ్ల మోజులో అధికారుల మౌనం...**
నిబంధనల ప్రకారం పర్మిట్ రూమ్‌లో శుభ్రత పాటించాలి, వంట చేయకూడదు, 21 ఏళ్లలోపు వారిని అనుమతించకూడదు. కానీ ఇక్కడ అన్నీ ఉల్లంఘనలే. ఎక్సైజ్ అధికారులు తనిఖీల పేరుతో వచ్చి పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రం నామమాత్రపు కేసులు చేస్తూ...ఆ తర్వాత షరా మామూలే....అంటూ మామూళ్లు తీసుకుని వెళ్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా ప్రజారోగ్యం గాల్లో దీపమైంది.

**నిబంధనలు ఉల్లఘించిన షాపులు మూసివేయాలి...**
పర్మిట్‌రూమ్‌ల నిర్వహణ పట్ల స్థానికులు మాట్లాడుతూ, ఇవి పర్మిట్ రూమ్‌లు కాదని రోగాల రూమ్‌లుగా అభివర్ణిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి లైసెన్స్‌లు రద్దు చేయాలని, లేకపోతే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అన్ని వైన్స్ పర్మిట్ రూమ్‌లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన షాపుల లైసెన్స్‌లు తక్షణమే రద్దు చేయాలని, హాల్లో వంటలు, ఓపెన్ టాయిలెట్స్ నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం**
**ఎక్సైజ్ ఎస్ఐ విజయ సిదార్థ**
రామాయంపేట మండల పరిధిలోని వైన్స్‌లకు అనుబంధంగా ఉన్న పర్మిట్ రూమ్‌లలో ఎక్సైజ్‌శాఖ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని రామాయంపేట ఎక్సైజ్ ఎస్ఐ విజయ సిదార్థ తెలిపారు.

## ప్రమాదకరంగా మారిన రోడ్లు..



నాగలిగిద్ద సమీపంలో ప్రమాదకరంగా మారిన రోడ్డు

**నాగలిగిద్ద, జూన్ 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొందిగామతో పాటు నాగలిగిద్ద మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారాయని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వాహనాలమీద ప్రయాణం చేయాలంటే ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయానికి గురవుతున్నామని, అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## జహీరాబాద్ 16వ వార్డులో నూతన బోర్ ప్రారంభం



నూతనంగా బోర్లు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

**జహీరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణం 16వ వార్డులో త్రాగు నీటి సరఫరా సమస్య పరిష్కారానికి నూతన బోర్ ఏర్పాటు చేశారు. వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి చేతుల మీదుగా నూతన బోర్‌ను ప్రారంభించారు.వేసవిలో నీటి కష్టాలు తీరేందుకు ఈ బోర్ ఎంతో ఉపయోగపడుతుంది అని వార్డుప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ముభీన్, కౌన్సిలర్ జమీల్ ఉద్దీన్, శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, శేఖర్, రామన్న, సూర్యప్రకాష్, అశ్విన్‌పాటిల్, ప్రేమచంద్ పాల్గొన్నారు.

## జహీరాబాద్ గడ్డపై నీలి జెండాను ఎగురవేస్తాం

**-భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధు రావణ్**

**జహీరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాబోయే రోజులలో జహీరాబాద్ గడ్డపై నీలి జెండాను ఎగురవేస్తామని భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధూ రావణ్ అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణ బైపాస్ రోడ్డు సమీపంలోని ఇంద్రప్రస్థలో నిర్వహించిన బహుజనుల ఆత్మీయ సమ్మేళనసభలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కాన్షీరామ్ ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లే విధంగా ఈ సభ నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధు రావణ్ మాట్లాడుతూ భవిష్యత్తులో జహీరాబాద్ గడ్డమీద నీలి జెండా ఎగురవేస్తామన్నారు. మన ఊరు, మన అభివృద్ధి, మన స్థానికత అనే అంశాలను లేవనెత్తి అనేక మందికి ఉపాధి కలిగేలా భవిష్యత్తు తరాలలో జహీరాబాద్ పట్టణమును పారిశ్రామిక అభివృద్ధి పట్టణముగా తీర్చిదిద్దేలా ప్రతి ఒక్క బహుజనుని బాధ్యతగా మేలుకొలపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నరసింహ, బాలరాజ్, శంకర్, దీపక్, ఆకాష్, విష్ణు, రాజు, నర్సింగ్‌రావు, రాములు, మొగులయ్య, ఇస్మాల్, అప్పు అడ్వకేట్, ధనరాజ్, సుభాష్ బుద్ధిష్ట్, అనంతయ్య, నరసింహులు టీచర్, అశోక్, రఘువీర్ బుద్ధిష్ట్, పలువురు యువకులు, సామాజిక నాయకులు, మాలసంఘ సభ్యులు పాల్గొని రాజ్యాధికార దిశగా ఈసభకు తమ ఐక్యతను మద్దతును ప్రకటించారు.

## ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

**చిన్నశంకరంపేట, జూన్ 1, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చిన్నశంకరంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు బాసరలోని ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన భవ్యశ్రీ, సాహితీ, వైష్ణవి, సంధ్య, రాకేష్, దీపక్, రిషివర్ధన్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రిన్సిపల్ వాణి అభినందించారు.

## రైతులను వేధిస్తున్న లారీల కొరత

**చిన్నశంకరంపేట, జూన్ 1, ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవాలంటే రైతన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. మండల కేంద్రం నుండి ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని తరలించాలని మండల పరిధి అంబాజీపేటలో రైతులు నిరసన వ్యక్తంచేశారు. నెలరోజులు గడుస్తున్నా లారీలు రావడం లేదని, రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. పంటకోసం చేసిన అప్పులు, టార్పాలిన్ల కిరాయి తడిసి మోపెడవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని, రోడ్డు ఎక్కితేనే అధికారులు స్పందిస్తారేమో అని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## నూతన మున్సిపల్ కమిషనర్‌గా జి.ప్రభాకర్

**జహీరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా నియమితులైన జి.ప్రభాకర్ సోమవారం అధికారికంగా తన పదవీబాధ్యతలను స్వీకరించారు. జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. పదవీబాధ్యతలు చేపట్టేందుకు కార్యాలయానికి విచ్చేసిన కమిషనర్ జి.ప్రభాకర్‌కు మున్సిపల్ సిబ్బంది శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, జహీరాబాద్ పట్టణ అభివృద్ధికి ఆయన నాయకత్వంలో మరింత వేగం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇంతవరకు మున్సిపల్ కమిషనర్‌గా సేవలందించిన జైత్రీరామ్ ఆదివారం పదవీవిరమణ చేసిన విషయం తెలిసిందే. ఆయన సేవలను సిబ్బంది ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన జి.ప్రభాకర్ మున్సిపల్ శాఖలో పారదర్శక పరిపాలనతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఈసందర్భంగా మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమపథకాలను సమర్ధవంతంగా అమలుచేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కోర్పోల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

**చౌటకూర్, జూన్ 1, ప్రభాతవార్త:** చౌటకూర్ మండలంలోని కోర్పోల్ గ్రామంలో బోయిన సోనీ భర్త విష్ణు, బోయిని మోనిక భర్త మల్లేశం కుటుంబాలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ వసంతకుమారి, ఎంపీడీవో కె.శంకర్, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్ పాల్గొని ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వసంత కుమారి మాట్లాడుతూ, ప్రభుత్వం పేదలకు గృహ సౌకర్యం కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు పొంది గృహప్రవేశం చేసిన కుటుంబాలకు అభినందనలు తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. వచ్చే నెలలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోర్పోల్ గ్రామ సర్పంచ్ సునీత ప్రవీణ్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జె.సంజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, గ్రామపెద్దలు మహిపాల్‌రెడ్డి, రాములు, సాగర్, శంకర్, ఉప్పర్‌గూడెం ఈశ్వర్‌గౌడ్ తదితరులు, కుటుంబసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో ఎంపి, ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, జూన్ 1, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలు ఈరోజు అత్యంతవైభవంగా జరిగాయి. పట్టణంలోని పలువార్డుల్లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్‌శెట్కార్, నారాయణఖేడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా లబ్ధిదారుల ఇళ్లవద్ద రిబ్బన్లు కట్‌చేసి, ప్రత్యేకపూజలు నిర్వహించి, లబ్ధిదారులు జుబేదాబేగం, షబానా బేగం, సబియాబేగం, యు.శేఖర్‌లతో కలిసి వారు గృహప్రవేశాలు చేయించారు. పేదల సొంతింటికల నెరవేర్చడమే ప్రభుత్వం ధ్యేయం అని ఎంపి, ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గూడు కల్పించాలనే సంకల్పంతో నియోజకవర్గంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. కొత్త ఇళ్లలోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులకుటుంబాలకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ ప్రజాప్రతినిధులు, నారాయణఖేడ్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, వినోద్ పాటిల్, మాజీ పార్లమెంట్ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు, పండురెడ్డి మాజీ ఎంపిటిసి, మున్సిపల్ రుక్మిణిగోపాల్‌రెడ్డి, బి.రాజు, మహేష్, లక్ష్మణ్, మైతబ్, గోపాల్, వివేకానంద, మహేందర్, సుబుర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోప్సన్ సభ్యులు ముంతాజ్, పురంజన్, వీర్‌శెట్టి, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, వార్డు ప్రజలు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



గృహప్రవేశంలో పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యేలు

# ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**-ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరించిన కలెక్టర్**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూన్ 1, ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. జిల్లాలో డివిజన్‌ల వారీగా, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 73 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 05, ఆందోల్ డివిజన్‌కు 01, నారాయణఖేడ్ డివిజన్‌కు 9, జహీరాబాద్ డివిజన్‌కు 20 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

**-జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 1, ప్రభాతవార్త:** సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వరన్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎస్పీ సూచించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోయిన పక్షంలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం మానిటరింగ్ చేస్తూ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ అన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్

## సర్పంచ్ సామాజికసేవను కొనియాడిన కెటిఆర్



సర్పంచ్ పడమటి అనంత్‌రెడ్డి, కెటిఆర్‌ను కలుసుకున్న దృశ్యం

**కొండాపూర్, జూన్ 1, ప్రభాతవార్త:** కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామ సర్పంచ్ పడమటి అనంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, కెటిఆర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా అనంత్‌రెడ్డి చేసే సామాజిక సేవను కెటిఆర్ కొనియాడారు. ఇరువురి మధ్య సంగారెడ్డిజిల్లా రాజకీయ పరిణామాలు, రైతులసమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. గుంతపల్లి గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కెటిఆర్ హామీ ఇచ్చినట్లు అనంత్‌రెడ్డి తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కష్టపడి పనిచేసి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కెటిఆర్ సూచించినట్లు సమాచారం. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నట్లు అనంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా అనంత్‌రెడ్డికి పార్టీ తరపున భవిష్యత్‌లో మంచి అవకాశాలు వస్తాయని కెటిఆర్ ఆశీర్వదించినట్లు ఆయన తెలిపారు.

## గుమ్మడిదల ప్రీమియర్ లీగ్ విజేతగా బుల్స్

**-యువతను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలు**



క్రికెట్ క్రీడాకారుల దృశ్యం

**గుమ్మడిదల, జూన్ 1, ప్రభాతవార్త:** గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో యువతను ప్రోత్సహించడమే లక్ష్యం గా నిర్వహించిన తొలి గుమ్మడిదల ప్రీమియర్ లీగ్ క్రికెట్‌పోటీలు విజయ వంతంగా ముగిశాయి. మొత్తం నాలుగుజట్ల మధ్య 20మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీల్లో కెప్టెన్ నరేష్ నాయకత్వంలోని బుల్స్ జట్టు విజేతగా నిలవగా, కెప్టెన్ అంజన్‌గౌడ్ సారథ్యంలో వారియర్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబర్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ టోర్నమెంట్‌ను స్వప్నిల్, శ్రీకాంత్, పవన్‌చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలో ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరింత పెద్దస్థాయిలో క్రీడాపోటీలను నిర్వహిం చేందుకు కృషిచేస్తామని వారు పేర్కొన్నారు.

# నూతన పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 1, ప్రభాతవార్త:** అమీన్‌పూర్, పటాన్‌చెరు సర్కిళ్ల పరిధిలోని డివిజన్లలో 24 పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల అయ్యాయని, ప్రతి పార్కుని ప్రజలకోసం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఫేజ్ 2 కాలనీ పార్కు, హుడా కాలనీ పార్కు 2 కాలనీలలో ఒక కోటి 40 లక్షల రూపాయలతో చేపట్టనున్న పార్కుల అభివృద్ధిపనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాలు, గ్రామాల్లో నూతన పార్కుల ఏర్పాటు ద్వారా ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదానికి దోహదపడుతుందని తెలిపారు. పార్కులు ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణంలో నడక, వ్యాయామం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు. పార్కుల అభివృద్ధితో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటుతో పాటు ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం తహసీల్దార్ సరస్వతి, పటాన్‌చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతిరెడ్డి, ఈఈ సురేష్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లలితసోమిరెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, డిఈ కృష్ణవేణి, యుబిడి మేనేజర్ విక్రమ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేవేందర్‌యాదవ్, మల్లారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చెరువులు పూడ్చి వెంచర్లు..

**-రైతులభూములు బంజరుగా మారుతున్నాయంటూ ఫిర్యాదు**



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, జూన్ 1, ప్రభాతవార్త:** సదాశివపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈశ్రీతాబాద్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈశ్రీతాబాద్ చెరువుకు ఆనుకుని ఉన్న సర్వే నెం.127/ఇలో గల 3 ఎకరాల 3 గుంటల భూమి పక్కన ఉన్న ఎంకెపల్లి చెరువు కాలువను పూడ్చి వెంచర్ నిర్వాహకులు అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. చెరువు కాలువను మట్టితో పూడ్చివేయడంతో సాగునీటిమార్గం పూర్తిగా మూసుకుపోయిందని, దీంతో తమ భూములు వ్యవసాయానికి పనికిరాకుండా మారుతున్నాయని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల లాభాల కోసం రైతుల జీవనాధారమైన భూములను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి కాలువను పునరుద్ధరించడంతో పాటు తమ భూములకు వెళ్లే దారిని కల్పించి, వ్యవసాయ యోగ్యంగా మారేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదుచేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పృథ్వీరాజ్, వీరేశం, వెంకట్రావు, మహిపాల్, అనసూయ, బి.రాములు, పాపయ్య, రమేష్, రఫీ, హకీమ్, మోసిల్ పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునివ్వాలి

**-ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి**



పిడమర్తి రవిని సన్మానిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

**జహీరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి వారిని ఆదుకోవాలని తెలంగాణరాష్ట్రం ఉద్యమకారులు మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సోమవారం జహీరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా పట్టణంలోని పద్మశాలి భవన్లో తెలంగాణ ఉద్యమకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక తెలంగాణరాష్ట్రం కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపును ఇచ్చి ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల స్థలం వెంటనే ఇవ్వాలని ఉద్యమకారులు ఏరకంగా ఉద్యమించినా కూడా వారిని గుర్తించాలని ఉద్యమకారుల్లో ఉన్న కొన్ని రకాల సందేహాలను తీర్చారు. నియోజకవర్గాల వారీగా ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల స్థలాన్ని వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు, ఉపాధ్యాయులు రామచందర్, భీమ్, వంశీ, రిటైర్డ్ తహసీల్దార్ గడ్డం జనార్ధన్, తెలంగాణ ఉద్యమకారులు పి.రాములు నేత, ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మోహిన్, టిఎల్ఎఫ్‌నాయకులు డా.మదిరే సిద్ధన్న, న్యాయవాది కారదాసు పవన్, ఉపాధ్యాయులు సంజీవ్‌గౌడ్, జీవన్, ఉద్యమకారులు మహమ్మద్ ఇమ్రాన్, పేర్ల దశది, అరవింద్, బాలు, ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి రిటైర్డ్ ఉపాధ్యాయులు పద్మ, రమేష్ మొదలగు ఉద్యమకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

### తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపుకోవాలి : తలసాని

**అడ్డగుట్ట, జూన్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈనెల 2న (నేడు) జరగనున్నాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నియోజకవర్గంలోని ఆయా డివిజన్లల్లో, బస్తీలలో జెండాలను ఎగరవేసి ఘనంగా వేడుకలు జరుపుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. సోమవారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ముఖ్యనేతలతో ఆయన సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. జెండాలు ఆవిష్కరణ, అనంతరం ఉద్యమకారులను సన్మానించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, బిఆర్ఎస్ నేతలు బాల్‌రెడ్డి, అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, అకుల హరిక్రిష్ణ, శ్రీహరి, నాగులు, నరేందర్‌యాదవ్, కొండాపురం మహేష్‌యాదవ్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

**చాంద్రాయణగుట్ట, జూన్ 1, ప్రభాతవార్త:** పాతబస్తీ నర్కిపూల్ బాగ్‌లోని జీహెచ్ఎంసి చార్మినార్ జోన్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జోనల్ కమిషనర్ కన్నం సత్యనారాయణ వివిధ సర్కిళ్లకు చెందిన ప్రజల నుండి టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా జోనల్‌కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ సంతోష్‌నగర్, యాకుత్‌పురా, మలక్‌పేట్, చార్మినార్, మూసారంబాగ్ సర్కిళ్లకు చెందిన ప్రజలు స్థానిక సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై సంబంధిత విభాగాలచే వాటిపరిష్కారానికై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ ఏయంసీ రాజారావు, యుబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజ తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి పనుల్లో ఇబ్బందులు పరిష్కరించండి

**చాంద్రాయణగుట్ట, జూన్ 1, ప్రభాతవార్త:** అపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బిజెపినేతలు సోమవారం రాజేంద్రనగర్ జోన్ జెడ్సి సోలిపేట శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. లలితాబాగ్, కాళీకానగర్, రాఘవేంద్రనగర్, తానాజీనగర్ బస్తీలలో ఒకేసారి వివిధ పనులు చేపట్టటం వల్ల బస్తీలలో తిరుగలేని పరిస్థితి ఏర్పడిందని, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని భాగ్యనగర్ జిల్లా నేతలు మాణిక్‌రావు, సాయిరాంలు వివరించారు. ఈనెల 12 నుండి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వర్షాకాలం ప్రారంభమైతున్నందున అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు జెడ్సి సానుకూలంగా స్పందించారు.

## విద్యార్థులకు ఎల్లప్పుడు సహకారాలు ఉంటాయి : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూన్ 1, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థులకు ఎల్లప్పుడు తమ సహాయసహకారాలు ఉంటాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 10వతరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన 45మంది విద్యార్థినీవిద్యార్థులకు శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మడ్‌పోర్ట్ హైస్కూల్‌లో 45మందికి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే శ్రీగణేష్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవిద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధిచెంది ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి విద్యకు అత్యంతప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో గణేష్ దేవాలయం చైర్మన్‌నప్రభాకర్‌యాదవ్, ఉపవిద్యాశాఖాధికారి విష్ణువర్ధన్, కోఆర్డినేటర్ షెడ్రక్, కంటోన్మెంటు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, వికాస్‌మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్, సీనియర్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## గణేష్‌పల్లిలో అంగన్‌వాడీ బడిబాట

**మర్కుక్, జూన్ 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గణేష్‌పల్లి గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని సర్పంచ్ పుట్ట రామరాజు, ఉపసర్పంచ్ నర్సింలు కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని కోరుతూ టీచర్ కవిత సమక్షంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు విద్యతో పాటు పోషకాహారం, ఆరోగ్య సేవలు అందుతున్నాయని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, లక్ష్మయ్య, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి



ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

**గజ్వేల్ టౌన్, జూన్ 1 (ప్రభాతవార్త):** టిజిఎస్ఆర్‌టిసి సమైఖ్య జేఏసి ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ ఉద్యోగుల ప్రభుత్వ విలీన డిమాండ్ డే కార్యక్రమాన్ని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోలో నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టిజిఎస్ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న అపాయింటెడ్ డే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సమైఖ్య జేఏసి నాయకుడు అశ్వత్థామరెడ్డి పిలుపు మేరకు డిపో సిబ్బంది ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన అన్ని యూనియన్ల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శికి సన్మానం



పంచాయతీ కార్యదర్శి ఐలయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

**జగదేవ్‌పూర్, జూన్ 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా సేవలు కొనసాగించిన ఆసర్ల ఐలయ్య సోమవారం బదిలీ కావడంతో గ్రామ సర్పంచ్ రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఆయనను పాలక మండలి, గ్రామ ప్రజలతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవలు అందించిన ఐలయ్య సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయరాజు, పాలకమండలి సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

### -ఎఫ్‌సిఆర్ఐ డీన్ ప్రవీణ ఐఎఫ్ఎస్

**ములుగు, జూన్ 1 (ప్రభాతవార్త):** పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రకృతి సంపదలను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు సుస్థిరమైన జీవన వాతావరణాన్ని అందించవచ్చని ములుగు ఫారెస్ట్ కళాశాల అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డీన్ ప్రవీణ ఐఎఫ్ఎస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ములుగు ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించగా, జూన్ 1 నుంచి 12 వరకు నిర్వహించనున్న కార్యక్రమాల పోస్టర్‌ను డీన్ ప్రవీణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యమని వివరించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థుల కోసం వ్యాసరచన, క్విజ్, పజిల్ పోటీలు, గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, చిన్నారులకు పోటీలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, మొక్కలు నాటడం, పర్యావరణ ప్రతిజ్ఞ, నిపుణుల ఉపన్యాసాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే కళాశాలలో ప్లాస్టిక్ రహిత వాతావరణం సృష్టించడం, వ్యర్థాల వర్గీకరణ, బర్డ్ వాక్‌లు, నేచర్ ట్రైల్స్, ఓపెన్ డే కార్యక్రమాలు, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, పాములపై అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానం చేసి, నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షిస్తూ పచ్చని తెలంగాణ నిర్మాణానికి తమ కట్టుబాటును పునరుద్ఘాటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌సిఆర్ఐ అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్, జూన్ 1 (ప్రభాతవార్త):** ఇందిరమ్మ ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వానికి సూచించారు. ఇందులో భాగంగా 15వ వార్డులో స్థానిక కౌన్సిలర్ నక్క సంతోష రాములుగౌడ్‌తో కలిసి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్ నక్క సంతోష రాములుగౌడ్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కౌన్సిలర్లు గుంటుకు లక్ష్మిశ్రీనివాస్, బొగ్గుల స్వప్నసురేష్, కాముని మురళి, మమత, ఏఎంసి డైరెక్టర్ డాక్టర్ వాహిద్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, లక్ష్మణ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌చారి, పూజారి శ్రవణ్, ఆంజనేయులు, రాయపోల్ రమేష్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది, ఇందిరమ్మ కమిటీ ఇంచార్జ్ రాహెల్‌పాషా, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్

# భూసమస్యలు పరిష్కరిస్తానని లక్షలు వసూలు చేసిన అధికారి

### రెవెన్యూ అధికారిపై ప్రజావాణిలో బాధిత రైతుల ఫిర్యాదు



ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

**హుస్నాబాద్ రూరల్, జూన్ 1, ప్రభాతవార్త**

రైతుల సాదా బైనామా భూములకు పట్టాలు ఇప్పిస్తానని, లావణి భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేసిన రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో నిర్వహించిన ప్రజావాణిలో హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన నీరుకొండ దేవయ్య, బల్ల బాలరాజు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రామా అఖిలేష్ గతంలో నారాయణరావుపేట మండలంలో ఆర్ఐగా పనిచేసిన సమయంలో భూసమస్యలు పరిష్కరిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నాడని ఆరోపించారు. నీరుకొండ దేవయ్య నుంచి రూ.18.80 లక్షలు, బల్ల బాలరాజు నుంచి రూ.4.80 లక్షలు తీసుకున్నాడని, అంతేకాకుండా మండలంలోని పలువురు రైతుల నుంచి ఇదేవిధంగా లక్షల రూపాయలు వసూలు చేశాడని ఆరోపించారు. 2022 సంవత్సరం నుంచి ఇప్పటివరకు భూ సమస్యలు పరిష్కారం కాలేదని, డబ్బులు ఇచ్చిన విషయంపై అధికారిని ప్రశ్నిస్తే తనకు ఏమీ తెలియదని తప్పించుకుంటున్నాడని వాపోయారు. భూముల సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మి కుటుంబ సభ్యుల బంగారు ఆభరణాలు విక్రయించి నగదు సమకూర్చి అధికారికి అందజేశామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. 5 సంవత్సరాలు గడిచినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు అధికారిపై సమగ్ర విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని, బాధితుల నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి రికవరీ చేసి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే సంబంధిత అధికారి నివాసం ముందు పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



కలెక్టర్‌ను కలిసి పూలమొక్క అందజేస్తున్న నూతన డిఈవో

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిఈవో

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా నియామకమైన వరగంటి శాస్త్రి సోమవారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా విద్యాధికారిగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌రెడ్డి పదవి విరమణ పొందడంతో ఆయన స్థానంలో హైదరాబాద్ ఆర్జెడి కార్యాలయం నుంచి బదిలీపై జిల్లా విద్యాశాఖ అధికారిగా విచ్చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వరగంటి శాస్త్రికి కార్యాలయం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన డిఈవో వరగంటి శాస్త్రి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.హైమావతిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యా సంస్థలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ హైమావతి సూచించారు.

### శ్రీవిద్యా సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్...

**వర్గల్, జూన్ 1 (ప్రభాతవార్త):** మండలకేంద్రమైన వర్గల్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ విద్యా సరస్వతీ క్షేత్రంలో అమ్మవారిని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు కలెక్టర్ హైమావతిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## 400 మీటర్ల పరుగులో గౌతమ్‌కు స్వర్ణ పతకం

**కొమురవెల్లి, జూన్ 1,ప్రభాతవార్త :** జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట మినీస్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మండల పరిధిలోని రసులాబాద్ గ్రామానికి చెందిన యువ అథ్లెట్ చింతల గౌతమ్ ప్రతిభ కనబరిచాడు. అండర్-18 విభాగంలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకం, మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. గౌతమ్ సాధించిన విజయంపై గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని అకాంక్షించారు.

## కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**అల్లాదుర్గం, జూన్ 1 ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కళ్యాణలక్ష్మి ్మ, షాద్‌ముబా రక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వట్టిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేషారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బసన్నగారి బలరాం, వివిధ గ్రామాల సర్పంచులు మద్దూరి సౌమ్య, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ నాయక్, గోపాల్‌రెడ్డి, నాయకులు నర్సింలు,విట్టల్, భూమిరెడ్డి, జైపాల్ ఉన్నారు.

## సదాశివపేటలో ఇందిరమ్మ చీరల పంపిణీ

**సదాశివపేట, జూన్ 1 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం సదాశివపేటలోని 23, 12వ వార్డుల్లో ఘనంగా నిర్వహించారు. 23వ వార్డులో కౌన్సిలర్ శ్రీలక్షీ ్మ ప్రియ భరత్ ఆధ్వర్యంలో డ్వాక్రా గ్రూప్ మహిళలకు చీరలను పంపిణీ చేసి, అనం తరం ఇతర అర్హులైన మహిళలకు అందజేశారు. అలాగే 12వ వార్డులో కౌన్సిలర్ పులిమామిడి మమత ఆధ్వర్యంలో మార్కండేయ స్లం సమైఖ్యకు చెందిన డ్వాక్రా మహిళలకు పిఎంఆర్ గణేష్ మండపంలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి రుమాండ్ల శారద, ఎస్‌హెచ్‌జి(ఓబి) మాలె అనితతో పాటు డ్వాక్రా మహిళలు స్రవంతి, కవిత, రాణి, ఈశ్వరమ్మ, అనంత, రుక్కమ్మ, శైలజ, లక్ష్మి, ఆరిఫా, పాతిమా, గౌసియా బేగం, మల్లికా బేగం, నసీమ బేగం, తాయెరా బేగం తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా గణేష్‌రెడ్డి

**గజ్వేల్, జూన్ 1 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా గణేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ గణేష్‌రెడ్డికి మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### మెసెంజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**కొమురవెల్లి, జూన్ 1, ప్రభాతవార్త :** మండల వనరుల కేంద్రం(ఎంఆర్‌సి)లో ఖాళీగా ఉన్న మెసెంజర్ పోస్టును ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు మండల విద్యాధికారి కోనేటి రవి సోమవారం తెలిపారు. పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. నివాస ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, విద్యార్హతలు ఇతర సంబంధిత ధృవీకరణ పత్రాల రెండు సెట్ల జిరాక్స్ కాపీలు ఈనెల 3,4 తేదీలలో సాయంత్రం 4 గంటలోపు మండల వనరుల కేంద్రం కొమురవెల్లి కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9505477515 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### పంచాయతీ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలి

**జగదేవ్‌పూర్, జూన్ 1 (ప్రభాతవార్త):** గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్స్‌గా పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రతినెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాల్‌నర్సయ్య అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండలకేంద్రంలో ఎంపిడివో కార్యాలయం ముందు పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపివోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి గ్రీన్ ఛానల్ ద్వారా నేరులా కార్మికుల అకౌంట్‌లోకి రూ.26వేల వేతనాన్ని అందించాలన్నారు. సిబ్బంది ఎవరైనా ప్రమాదవశాత్తు మరణించినట్లయితే వారి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలని, దహన సంస్కారాలకు రూ.30వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగారి యాదయ్య, లోకుల నర్సింలు, మల్టీపర్పస్ వర్కర్స్ తుమ్మ అనిల్, తిరుపతి, చంద్రయ్య, బర్మ కొమురయ్య, నర్సింలు, కిష్టవ్వ, లింగవ్వ, నాగమణి, లక్ష్మి, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన బోధనకు గీతం ప్రోత్సాహం

### గీతం అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డిఎస్.రావు

**పటాన్‌చెరు, జూన్ 1, ప్రభాతవార్త :** భౌతికశాస్త్ర ఉపాధ్యాయులను నాణ్యమైన శిక్షణతో ప్రోత్సహించి, ఆ రంగాన్ని అభివృద్ధి చేయాలనే విద్యాపరమైన బాధ్యతగానే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు స్పష్టీకరించారు. అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు అనే అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల వృత్తి వికాస కార్యక్రమం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో సోమవారం ప్రారంభమైంది. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్(ఐపీఏ) విశాఖపట్నం విభాగం సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భౌతికశాస్త్ర రంగంలోని ప్రముఖ నిపుణుల నుంచి అధునాతన భావనలు, ఆచరణాత్మక అనువర్తనాలను నేర్చుకోవడానికి లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడురోజుల కార్యక్రమ స్వరూపాన్ని గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బివిఆర్ టాటా వివరిస్తూ ఉదయం సైద్ధాంతిక చర్చలు, భోజనానంతరం ఆచరణాత్మక శిక్షణ ఉండేలా ఈ కార్యక్రమాలను రూపొందించామని తెలిపారు. గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనంత రామకృష్ణ మాట్లాడుతూ.. భౌతికశాస్త్రం అత్యంత ఆకర్షణీయమైన విషయాలలో ఒకటని అన్నారు. విద్యార్థులు సైన్స్ విద్యను ఆర్థికంగా అర్థవంతంగా మార్చాల్సిన అవసరాన్ని ఆయన ఉద్ఘాటించారు. అనంతరం, శాస్త్రీయ ఆవిష్కరణలో ముడిపడి ఉన్న ఆచరణాత్మక సమస్యలు, పారిశ్రామిక అనువర్తనాలు, ఆర్థిక విలువను ప్రదర్శిస్తూ, విద్యుదయస్కాంతత్వం: కొన్ని నిజ జీవిత అనువర్తనాలు అనే అంశంపై ఆయన తొలి సాంకేతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో అందుబాటులో ఉన్న విద్య, పరిశోధనా సౌకర్యాలను డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా పరిచయం చేశారు. ముఖ్యంగా, అంతర్విభాగ పరిశోధనకు కేంద్రంగా పనిచేసే మల్టీడిసిప్లినరీ యూనిట్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ (మూర్తి) ల్యాబ్స్ ను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఐఐటీ మద్రాసు భౌతికశాస్త్ర విభాగం నుంచి పదవీ విరమణ చేసిన ఆచార్య నటరాజన్, గీతం విశిష్ట ఆచా ర్యుడు, సెంటర్ ఫర్ ఇంటర్ డిసిప్లినరీ సైన్స్‌కు చెందిన ప్రొఫెసర్ జి.రవికుమార్ తన అనుభవాన్ని పంచుకున్నారు. మంగళవారం (రెండవ రోజున) ఐఐఎస్సీ బెంగళూరు భౌతికశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ ఆచార్య విభోర్ సింగ్, భాభా అణు పరిశోధనా సంస్థ (బార్క్) పూర్వ శాస్త్రవేత్త జి.ఏ.రామారావు ఉపన్యసించనున్నారు. మరో రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణా కార్యక్రమాన్ని డాక్టర్ జి.సాయిప్రీతి, డాక్టర్ టి.విశ్వం సమన్వయం చేస్తున్నారు.

# హుస్నాబాద్‌లో స్లాటర్ హౌస్ నిర్మించాలి

### బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జీ పచ్చిమట్ల రవీందర్ గౌడ్



మాట్లాడుతున్న పచ్చిమట్ల రవిందర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 1, ప్రభాతవార్త**

హుస్నాబాద్ మున్సిపాలిటీలో ప్రజల ఆరోగ్య రక్షణకు యుద్ధప్రాతిపదికన ఆధునిక స్లాటర్ హౌస్ నిర్మించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో గొర్రెలు, మేకలు, కోళ్ల తదితర పశువులను వధించిన అనంతరం పశువైద్య శాఖ అధికారులు నాణ్యత పరీక్షలు నిర్వహించి ముద్రలు వేసేవారని గుర్తు చేశారు. మటన్, చికెన్ విక్రయదారులు ఆ ముద్రలున్న మాంసాన్నే విక్రయించాల్సి ఉండేదని, దీంతో ప్రజలకు నాణ్యమైన మాంసం అందడంతోపాటు స్థానిక సంస్థకు ఫీజుల రూపంలో ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం హుస్నాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతూ పరిశుభ్ర నగరంగా అవార్డులు సాధిస్తున్నప్పటికీ, ప్రజలు తినే మాంసం, చికెన్ నాణ్యతపై ఎలాంటి పర్యవేక్షణ లేదని విమర్శించారు. మాంసం విక్రయ కేంద్రాలు, హోటళ్లు, బార్లలో విక్రయించే మాంసం ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో తెలుసుకునే పరిస్థితిలేదని, గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రస్తుతం అధికారంలోఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే విధంగా వ్యవహరించడం తగదని, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రజల ఆరోగ్యంపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిధులు కేటాయించి స్లాటర్ హౌస్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్లాటర్‌హౌస్ ఏర్పాటు చేయకపోతే ప్రజలను సమీకరించి పెద్దఎత్తున మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు డేగల వెంకటేష్, దుండ్రా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపికి కమ్మరి శ్రీనివాస్ రాజీనామా

**గజ్వేల్, జూన్ 1 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు, మాజీ టెలికాం బోర్డు సభ్యులు కమ్మరి శ్రీనివాస్‌చారి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా కమ్మరి శ్రీనివాస్‌చారి మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వల్ల ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. బిజెపి పార్టీ పట్ల తనకు ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేస్తూనే, బిజెపిలో ఇముడలేకనే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావుకు నమ్మిన బంటుగా ఉంటూ పార్టీకి అనేక సేవలు అందించానన్నారు. వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేసి పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు.

## కుల బహిష్కరణ పేరుతో తప్పుడు కేసులు

### ఆకుల బాలయ్యపై నాగారం గ్రామ ముదిరాజ్ పెద్దల ఆరోపణ

**హుస్నాబాద్ టౌన్, జూన్ 1, ప్రభాతవార్త :** మండలంలోని నాగారం గ్రామంలో కుల బహిష్కరణ పేరుతో తమపై తప్పుడు కేసులు నమోదు చేయించి వేధింపులకు గురిచేస్తున్నారని ముదిరాజ్ కుల పెద్దలు ఆరోపించారు. సోమవారం పట్టణంలో వారు మాట్లాడుతూ నాగారంకు చెందిన ఆకుల బాలయ్య కుల బహిష్కరణ పేరుతో కేసులు పెట్టి వారి కులాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, గతంలో నాగారం, ఉమ్మాపూర్ చెరువు వ్యవహారంలో వివాదం కొనసాగగా, ఈ విషయంలో మత్స్యకారుల జీవనోపాధికి సంబంధించిన అంశాలపై చర్చించి సమస్యను పరిష్కరించుకుందామని ప్రయత్నించినప్పటికీ, తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని పేర్కొన్నారు. అంతేకాకుండా, కులబహిష్కరణ వంటి ఆరోపణలతో కేసులు నమోదు చేయించడంతోపాటు, తమపై దాడులు చేస్తూ తిరిగి తమపైనే కేసులు పెడుతున్నారన్నారు. ఈ పరిణామాల వల్ల గ్రామంలోని మత్స్యకార కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారి జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిజానిజాలను అధికారులు సమగ్రంగా విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో పెసరు రాజయ్య, భాషవేణి కొమురయ్య, రెడ్డి పోచయ్య, రెడ్డి బిక్షపతి, రెడ్డి సారయ్య, అరిగే జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఖేతి బచావో అభియాన్‌పై రైతులకు అవగాహన

**అక్కన్నపేట, జూన్ 1, ప్రభాతవార్త :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చౌటపల్లి, గోవర్ధనగిరి గ్రామాల్లో ఖేతి బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి తస్లీమా సుల్తానా, వ్యవసాయ విస్తరణ అధికారులు ఐశ్వర్య, శేఖర్ రైతులకు పంట అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలు, యూరియా వినియోగంలో జాగ్రత్తలు, సన్న రకాల వరి సాగు ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవ ఎరువులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి సాగు ఖర్చులు తగ్గుతాయని వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత

**మర్కుక్, జూన్ 1(ప్రభాతవార్త):** మండల పరిధిలోని శివారువెంకటాపూర్, మర్కుక్ గ్రామాలకు చెందిన రెడ్డమైన నర్సింలు, రాసాల అంజయ్యలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం బిజెపి మండల అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చుల నిమిత్తం సహకరించే సిఎం రిలీఫ్‌ఫండ్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి సంజీవరెడ్డి, పుట్ట ఆంజనేయులు, శేఖర్, తులసి భాస్కర్, మైసిగారి బాలకృష్ణ పాపోల్ల శేఖర్, గుర్రాల రాజు పాల్గొన్నారు.

## ప్రొకబడ్డీ లీగ్‌కు లారెన్ ఎంపిక పట్ల హర్షం

**గజ్వేల్ టౌన్, జూన్ 1 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్‌కు చెందిన కబడ్డీ క్రీడాకారుడు లారెన్ ప్రో కబడ్డీ లీగ్‌కు ఎంపిక కావడం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్ హర్షం వ్యక్తంచేశారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కబడ్డీ అసోసియేషన్ జిల్లా సభ్యుడు లారెన్ ప్రో కబడ్డీ లీగ్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ప్రస్తుతం లారెన్ కేరళలో జరిగే కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాడని, త్వరలో తెలంగాణకు వస్తాడని తెలిపారు. సిద్దిపేట జిల్లా నుండి జాతీయ స్థాయిలో కబడ్డీ ప్రో లీగ్‌కు ఎంపిక కావడం యువతకు స్ఫూర్తిదాయకమని, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అందిస్తున్న ప్రోత్సాహం శిక్షణ వల్లే లారెన్‌కు అవకాశం దక్కిందని, కఠిన శ్రమ, క్రమశిక్షణ ఉంటే అనుకున్న లక్ష్యానికి చేరవచ్చని, యువత క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రెటరీ శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రో కబడ్డీ లీగ్‌లో అడుగుపెడుతున్న లారెన్‌కు అభినందనలు తెలిపారు.

## లక్ష్మీపూర్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశం

**బెజ్జంకి, జూన్ 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో వడ్లకొండ రేణుక శంకర్ నూతన ఇందిరమ్మ ఇళ్లు సోమవారం గృహ ప్రవేశం చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపిడివో ప్రవీణ్‌లు కార్యక్రమంలో పాల్గొని నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించి గృహ ప్రవేశం చేశారు. లబ్దిదారులు రేణుక శంకర్ మాట్లాడుతూ సొంతింటి కలనెరవేర్చిన సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, ఉప సర్పంచ్ హరీష్, లక్ష్మీనరసింహ స్వామి, టెంపుల్ కమిటీ మాజీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, బైర సంతోష్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, రెడ్డి రామకృష్ణరెడ్డి, గుబిరే చంద్రం, కత్తి రమేష్, వార్డు సభ్యులు తిరుమల, రమణరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### అక్కన్నపేటలో...

**అక్కన్నపేట, జూన్ 1, ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన తంగళ్లపల్లి కీర్తనశ్రీనివాస్ దంపతులు సోమవారం తమకు మంజూరైన ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇంటిలో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ జన్నారపు సంపత్, ఎంపీడీవో బానోత్ జయరాం నాయక్, ఎంఈఓ గుగులోతు రంగానాయక్, ఏఈ ధనలక్ష్మి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు అతిథులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కీర్తన-శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కుటుంబానికి పక్కాఇల్లు కలను సాకారం చేసిన ప్రభుత్వానికి, సహకరించిన ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేత

**జగదేవ్‌పూర్, జూన్ 1 (ప్రభాతవార్త):** మండలకేంద్రంతో పాటు తిమ్మాపూర్‌లో కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు సోమవారం సర్పంచ్ అందజేశారు. ఈకార్యక్రమంలో లబ్ధిదారులు, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ రాజు, జిపివో శివకుమార్, ఉపసర్పంచ్ అక్కరాజు నాగరాజు, వార్డు సభ్యులు పోసాన్‌పల్లి కిష్టయ్య, నవనీత కుమార్, గ్రామ పెద్దలు తలకొక్కుల శ్రీశైలం, దేవసాని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నివీర్ ఉద్యోగానికి లోకేష్ ఎంపిక

**జగదేవ్‌పూర్, జూన్ 1 (ప్రభాతవార్త):** మండలకేంద్రానికి చెందిన దండె లోకేష్ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. లోకేష్ పేద కుటుంబంలో పుట్టి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని పట్టుదలతో శ్రమించి అగ్నివీర్ ఉద్యోగం సాధించడం పట్ల వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు ప్రజలు అభినందనలు తెలిపారు. లోకేష్ తండ్రి దండె ఉపేందర్ మాట్లాడుతూ తమ కుమారుడు ప్రతిభ కనబరిచి విజయం సాధించడం పట్ల గర్వంగా ఉందని అన్నారు.

## వరి కొయ్యలను కాలిస్తే జరిమానా తప్పదు : సర్పంచ్

**జగదేవ్‌పూర్, జూన్ 1 (ప్రభాతవార్త):** రైతులు వరి కొయ్యలను కాలిస్తే జరిమానా తప్పదని పీర్లపల్లి సర్పంచ్ ఓంప్రకాష్ అన్నారు. సోమవారం మండల వ్యవసాయాధికారి వసంతరావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు మాట్లాడుతూ కేతి బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పంట అవశేషాల కాల్చివేత వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, అందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతిని పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, భూమిలో సేంద్రీయ కర్బనం తగ్గుతుందని, రైతులు వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని అన్నారు. సర్పంచ్ ఓంప్రకాష్ మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చినట్లయితే రైతులకు జరిమానా విధిస్తామని గ్రామసభలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రం ప్రారంభంలో బిజెపికి అవమానం

-రామాయంపేట బిజెపి నాయకుల ఆగ్రహం
-తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**రామాయంపేట, జూన్ 1, ప్రభాతవార్త:**
జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం 45 రోజులుగా కష్టపడిన బిజెపి ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి, ఎంపి రఘునందన్‌రావును కనీసం ఆహ్వానించకుండానే ప్రారంభోత్సవం నిర్వహించడంపై బిజెపినేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రామాయంపేట మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన ఈఘటనపై బిజెపి తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంది. ఈఘటనపై నిరసనగా బిజెపి నాయకులు స్థానిక తహసీల్దార్ రజనీకుమారిని కలిసి జరిగిన విషయాన్ని వివరించారు. అనంతరం కార్యాలయం మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఘటనపై విచారం వ్యక్తంచేసిన తహసీల్దార్ రజనీకుమారి బాధ్యులపై విచారణ జరిపి తగినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రామాయంపేటలో జొన్నల కొనుగోలు కేంద్రం మంజూరు కోసం స్థానిక బిజెపి నాయకులు, మండలపరిధిలోని బిజెపిసర్పంచులు ఎంపి రఘునందన్‌రావు ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎమ్మార్వోలను కలిసి రైతుల సమస్యను వివరించామన్నారు. వీరి నిరంతరకృషి ఫలితంగానే జొన్నల కొనుగోలుకేంద్రం మంజూరైందని తెలిపారు. అయితే ఇంత కష్టపడిన ప్రజాప్రతినిధులను ప్రారంభోత్సవానికి పిలవకుండా, వారు అక్కడికి చేరుకునేలోపే హడావుడిగా కార్యక్రమాన్ని పూర్తిచేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. ప్రజలకోసం పోరాడి సాధించిన ఫలితాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దొంగచాటుగా ప్రారంభించడం దారుణమని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయ భేదాభిప్రాయాలు సహజమే అయినా, ప్రజలకోసం కష్టపడిన ప్రజాప్రతినిధులను అవమానించడం సరికాదని, అధికారంలో ఉన్నవారు అన్నిపార్టీల నాయకులను సమానంగా గౌరవించాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. బాధ్యులైన అధికారులపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, సర్పంచులు మస్కూరి బాలరాజ్, నవీన్‌గౌడ్, యాదగిరి, కౌన్సిలర్ శంకర్‌గౌడ్‌తోపాటు దంతేపల్లి, లక్ష్మాపూర్, అక్కన్నపేట గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రావి ఆకుపై తెలంగాణ సంస్కృతి



రావి ఆకుపై తెలంగాణ చిత్రం వేసిన కళాకారుడు గుండు శివకుమార్

**నారాయణఖేడ్, జూన్ 1, ప్రభాతవార్త:**
రావి ఆకుపై నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ మన ఆత్మగౌరవాన్ని సూచించే తెలంగాణ రాష్ట్ర మ్యాప్ చిత్రాన్ని గీశాడు. మధ్యలో కాకతీయ కళాతోరణం, తెలంగాణ చరిత్ర, సంస్కృతి ప్రతీక, ఎడమవైపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రం, ప్రజానాయకత్వం అభివృద్ధి నాయకత్వానికి సందేశం, కుడివైపున భగీరథ, కాళేశ్వరం అభివృద్ధి, సాగునీటి ప్రగతిని సూచిస్తాయి. కిందివైపు బంగారు బతుకమ్మ, తెలంగాణ సంస్కృతి, ఆడబిడ్డల ఆత్మీయత, పండుగ గొప్పతనానికి ప్రతీక. ఈవిధంగా రావి ఆకుపై వివిధనమూనాల చిత్రాలతో మొత్తం రూపకల్పన చేసిన చిత్రంతో రాష్ట్ర ప్రజలందరికీ కూడా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణిలో 9 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

**నారాయణఖేడ్, జూన్ 1, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ ఉమాహారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈకార్యక్రమంలో ప్రజలనుండి మొత్తం 9 దరఖాస్తులు స్వీకరించబడినవి. కార్యక్రమంలో డివిజన్‌స్థాయి అధికారులు, మండలపరిషత్ అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు, ఇరిగేషన్, వ్యవసాయ, ఆరోగ్య, వైద్య, విద్య, సివిల్ సప్లైస్, సోషల్ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు పాల్గొని, ప్రజల నుండి స్వీకరించబడిన వినతులను పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులు స్వీకరించిన వినతులపై తక్షణచర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ ఉమాహారతి ఆదేశించారు.

## నూతన తహసీల్దారుగా విజయలక్ష్మి

**వెల్దుర్తి, జూన్ 1, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన వెల్దుర్తికి నూతన తహసీల్దారుగా విజయలక్ష్మి సోమవారం పదవీబాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ ఉత్తర్వులమేరకు విజయలక్ష్మి బాధ్యతలుచేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండి, వారిసమస్యల పరిష్కారంకోసం కృషిచేస్తానని అన్నారు.

## ఖర్చుల వివరాలు ఇవ్వడంలో జాప్యం ఎందుకు?

-దౌలతాబాద్ గ్రామ పంచాయతీ వార్డ్‌సభ్యులు



సమావేశాన్ని బహిష్కరించిన వార్డ్‌సభ్యులు

**హత్నూర, జూన్ 1, ప్రభాతవార్త:**
గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోవడంతోపాటు అవమానపరిచేవిధంగా మాట్లాడటంతో సమావేశాన్ని బహిష్కరించినట్లు హత్నూరమండలం, దౌలతాబాద్ గ్రామ పంచాయతీ వార్డుసభ్యులు తెలిపారు. సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఖర్చుల వివరాలు అడగగా, సర్పంచ్ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో, సమావేశాన్ని బహిష్కరించి బయటకువచ్చామని వార్డుసభ్యులు మహమ్మద్ గౌస్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. సమావేశం బహిష్కరించినవారిలో తనతోపాటు వార్డుసభ్యులు ముల్ల యాదయ్య, పిల్లముల్ల రవి, కొన్నియాల శ్రీనివాస్, అరిగే శిరీషసాయికుమార్‌లు ఉన్నారని అన్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి మజార్ అలీని వివరణ కోరగా, ఖర్చుల వివరాలు సభ్యులు అడుగగా వివరించామని, వారు సమావేశాన్ని బహిష్క రించారాని అనడంలో వాస్తవం లేదని అన్నారు.

## శేఖాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

**జహీరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని శేఖాపూర్‌గ్రామంలో మొదటివిడతలో మంజూరై పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను సోమవారం జడ్పి సిఈఓ జానకిరెడ్డి, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి వారికి సొంతింటి కలను సాకారంచేయడానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఎస్.ఉజ్వల్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీ బిక్షపతి, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పి.నరసింహరెడ్డి, సీడీసీ చైర్మన్ మోబిన్, సర్పంచ్ చస్ముద్దీన్, అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు ఊరట..

-రామాయంపేటలో జొన్నల కొనుగోలుకేంద్రం

**రామాయంపేట, జూన్ 1, ప్రభాతవార్త:**
రామాయంపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలుకేంద్రాన్ని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్యానాగరాజుతో కలిసి పిఎసిఎస్ చైర్మెన్ బాదె చంద్రంలు ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులకు గిట్టుబాటుధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలుకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ రజనీకుమారి, మండల వ్యవసాయాధికారి ప్రవీణ్, ఎఈవోలు సాయి, ప్రవీణ్, పిఎసిఎస్ సిఈవో పుట్టి నర్సింలు (గజ్జెల), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌస్, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ పోచమ్మల నవనీతగణేష్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, గుగులోత్ రవి, బైరం స్వప్నకుమార్, మద్దెల మాధవి రమేష్, కోఆప్షన్ సభ్యులు చింతల రాధాభవానియాదగిరి, గౌస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు చింతల స్వప్నస్వామి, పార్టీనాయకులు రమేష్‌రెడ్డి, చింతల యాదగిరి, యెనిశెట్టి అశోక్, దాకి స్వామి, మోబిన్, దండు శివ, సిద్ధిరాములు, పచ్చంటి రాము, ఎర్రం సత్యం, సాదుల పరశురాములు, దారం సంతోష్, చిలుక విరాట్, దాకి నాగేంద్ర, సుధీర్‌గౌడ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నెరవేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే

-సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్

**కౌడిపల్లి, జూన్ 1, ప్రభాతవార్త:**
నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు, మండలాధ్యక్షులు, కౌడిపల్లి గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణాగౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామానికి చెందిన వంజరి భిక్షపతి, బంజ చంద్రకళలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించడానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనారు. ముందుగా ఇందిరమ్మ ఇళ్లను ఎంపిడివో శ్రీనివాస్‌లతో కలిసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం రెండవవిడుతలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పొందిర లబ్దిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రం కృష్ణాగౌడ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇచ్చి నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో వీరితోపాటు గ్రామ ఉపసర్పంచ్ శ్వేతామల్లికార్జున్‌గౌడ్, నాయకులు రాగుల భూమయ్యపటేల్, పుండరీకంగౌడ్, సత్యనారాయణగౌడ్, రమేష్‌గౌడ్, మాజీ కోఆప్షన్ మెంబర్ హైమద్, వార్డుసభ్యులు దేవేందర్‌కుమార్, లక్ష్మిశరత్, కారోబార్ యేల్లం, ఇందిరమ్మ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి

-మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ మరాజుయాదవ్

**నర్సాపూర్, జూన్ 1, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని అన్నివార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అభివృద్ధికి కృషిచేస్తానని మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజు యాదవ్ అన్నారు. సోమవారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 2, 4, 12, 14 వార్డులలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె చేతుల మీదుగా కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్ మాట్లాడుతూ, వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధిపనులను ప్రారంభించామని తెలిపారు. ఇందుకు ప్రజలు, అధికారులు అందరూ సహకారం అందించాలని మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్ అన్నారు. ఈసందర్భంగా స్థానికప్రజలు ఈ అభివృద్ధి పనులను స్వాగతించి హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ తోపాటు వైస్‌చైర్మన్ బుచ్చేష్‌యాదవ్, మాజీమున్సిపల్‌చైర్మన్ మురళీధర్ యాదవ్, కౌన్సిలర్ సుధీర్‌గౌడ్, బుల్లెట్‌రాజు, మొహిజుద్దీన్, చింతకుంట శ్రీకాంత్, నిరంజన్‌దాస్ నాయకులు ధావూద్, ఇల్యాస్‌ఖాన్, ఆంజనేయులు, రవి, బాల్‌రెడ్డి, బిక్షపతి, రాజు, షేక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి గ్రామపంచాయతీ ఈవోగా కృష్ణ



నూతన ఈవో కృష్ణను సన్మానించిన సర్పంచ్ ఆదర్శ్

**వెల్దుర్తి, జూన్ 1, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తి నూతన గ్రామ పంచాయతీ ఈవోగా కృష్ణ సోమవారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈవోగా ఉన్న బలరాంరెడ్డి శివంపేట మండల్ సికింద్రాబాద్‌కు బదిలీపై వెళ్లారు. కాగా, ఈవో కృష్ణ మాట్లాడుతూ గ్రామపంచాయతీకి సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని. అలాగే అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. స్థానిక సర్పంచ్ ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రవణ్‌కుమార్, వార్డుసభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ లు నూతన ఈవో కృష్ణను ఘనంగా సన్మానించారు.

## రెడ్డిపల్లిలో మహాలక్ష్మి ధాన్యం గోదాం ప్రారంభం

**నర్సాపూర్ రూరల్, జూన్ 1, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌మండలం రెడ్డిపల్లిగ్రామంలో మహాలక్ష్మి ధాన్యం గోదామును మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ చొరవతో రెడ్డిపల్లి గ్రామసర్పంచ్ పద్మావతిఅశోక్‌గౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు తడవకుండా వెంటనే గోదాములలో నిల్వచేసి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సర్పంచ్ కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందుబాటులో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులు ధైర్యంగా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెదక్ డీఎం, డీఎస్ఓ, ఆర్డీఓ, రామకృష్ణ, ఎంఆర్ఓ శ్రీనివాస్, నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మెన్ లక్ష్మిరాజుయాదవ్, మండల అధ్యక్షులు మల్లేశం, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పూలే-అంబేద్కర్ సేవారత్న అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 1, ప్రభాతవార్త:**
బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకమైన మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్.బిఆర్‌అంబేద్కర్, ఎపిజె అబ్దుల్ కలాం సేవారత్న, ఉత్తమ సర్పంచ్, విద్యారత్న, ఉమెన్ లీడర్షిప్ అవార్డులకోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బిఎస్ఎ సంగారెడ్డిజిల్లా కమిటీ ప్రకటించింది. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లుగానే ఈ ఏడాదికూడా తెలంగాణరాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ 19వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2026 జూలై 12న జరగనున్న ఈ కాన్ఫరెన్స్‌కు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా, తెలంగాణ రాష్ట్రాలనుండి సుమారు 600మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఒక్కరోజుపాటు జరిగే ఈ సమావేశంలో ఉదయం సెషన్‌లో వెస్టన్ ఇండియాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించబడుతుందని వెల్లడించారు. ఈ అవార్డులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పూలే-అంబేద్కర్ సిద్ధాంత భావజాలంతో పనిచేస్తున్న ఇతర వర్గాల వ్యక్తులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజా ఉద్యమకారులు, సంఘసేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు కూడా అర్హులని తెలిపారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులుగా నల్లా రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా విష్ణువర్ధన్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా స్రామాట్ గోవర్ధన్ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అవార్డులకు దరఖాస్తు చేయదలచిన వారు 98488 43686, 96668 48301 నంబర్లను సంప్రతించాలని నిర్వాహకులు సూచించారు.

## అధికారుల గైర్హాజరుతో వెలవెలబోయిన ప్రజావాణి




అధికారులు లేక ఖాళీ కుర్చీలతో ప్రజావాణి

**మొగుడంపల్లి, జూన్ 1, ప్రభాతవార్త:**
మొగుడంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం వెలవెలబోయింది. రెవెన్యూ శాఖ అధికారులు మినహా ఇతరశాఖల అధికారులు హాజరుకాకపోవడం విమర్శలకు దారితీసింది. ప్రజల సమస్యలను స్వీకరించే కార్యక్రమంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. దీంతో ప్రజావాణిపై ప్రజల్లో ఆసక్తి తగ్గుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

**మొగుడంపల్లి, జూన్ 1, ప్రభాతవార్త:**
మొగుడంపల్లిమండలం ధనసిరిగ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులను హౌసింగ్ పీడీ చలపతిరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదకుటుంబాలకు సొంతింటికలను సాకారంచేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిర్మాణపనులను వేగవంతంగా పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ, ఇళ్లనిర్మాణం చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నిహారికరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం తదితరులు ఉన్నారు.

## అంతర్జాతీయ పోటీల్లో మెరిసిన క్రీడాకారులు

-అభినందించిన ఎమ్మెల్యే జిఎంఆర్



అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, జూన్ 1, ప్రభాతవార్త:**
నేటితరం యువతకు స్ఫూర్తిని అందించేలా అంతర్జాతీయ పోటీల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శన అందించి, భారతదేశ గొప్పతనాన్ని అంతర్జాతీయవేదికపై గర్వపడేలా చేయడం అభినందనీయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే, మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ ప్యాట్రాన్ గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గత నెల 23, 24వ తేదీలలో శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ మీట్‌లో భారతదేశం తరపున సంగారెడ్డిజిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన 14మంది క్రీడాకారులు (35-100 సంవత్సరాలలోపు) వివిధ క్రీడాపోటీలలో పాల్గొన్నారు. మొత్తం 52పతకాలు సాధించగా, వీటిలో బంగారుపతకాలు 27, వెండిపతకాలు 11, కంచుపతకాలు 4 ఉన్నాయి. ఈసందర్భంగా సోమవారం ఎమ్మెల్యే జిఎంఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గత 20సంవత్సరాలుగా తమ క్రీడాపోటీలకు సంపూర్ణ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఫహీం ఇక్బాల్, ప్రధానకార్యదర్శి శామ్యూల్, ఉపాధ్యక్షులు బాలయ్య, నరేందర్‌రెడ్డి, భాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎల్లోర, సభ్యులు కరుణాకర్‌రావు, మల్లయ్యగౌడ్, నిర్మల, అనసూయ, సరోజినీ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రమ్మ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలి

-గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్

**గుమ్మడిదల, జూన్ 1, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఇంద్రమ్మ గృహాల లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించేలా అధికారులు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ కోరారు. సోమవారం బొంతపల్లి గ్రామానికి చెందిన బదనపురం కవిత, మరిగని నాగమణిల గృహప్రవేశ కార్యక్రమాలకు మున్సిపల్ కమిషనర్ దశరథ్, వార్డుకౌన్సిలర్లతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీరితో కౌన్సిలర్లు, స్థానికప్రజాప్రతినిధులు ఉన్నారు.

## త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

-బుడగజంగం కాలనీలో బోరుబావి ఏర్పాటు



బోరుబావి ప్రారంభిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, జూన్ 1, ప్రభాతవార్త:**
గ్రామంలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం బుడగజంగం కాలనీలో కొత్త బోరుబావి ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పావని నరేందర్‌గౌడ్ తెలిపారు. వేసవిలో ప్రజలకు తగినంత త్రాగునీరు అందించేందుకు గ్రామపంచాయతీ ప్రత్యేకదృష్టి సారించిందన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు బోరుబావి తవ్వకాలు చేపట్టి నీటి వసతిని కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సర్పంచ్ పావని నరేందర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రత్యేకనిధులు కేటాయించి విద్యుత్‌మోటర్లను అందజేశారు. దీంతో ఆయా కాలనీలలో మోటర్లను బిగించి త్రాగునీటి ఎద్దడి నివారించినట్లు పేర్కొన్నారు. మెదక్ ఎమ్మెల్యే సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పద్మ



మాలతీదేవి నుండి బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మ

**పాపన్నపేట, జూన్ 1, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని యూసుఫ్‌పేట ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా బెండల పద్మ సోమవారం పదవీబాధ్యతలు చేపట్టారు, ఇప్పటి వరకు హెడ్మాస్టర్‌గా పనిచేసిన మాలతీదేవి ఇటీవల పదవీవిరమణచేశారు. దీంతో పద్మ హెచ్‌ఎంగా మాలతీదేవి నుండి చార్జి తీసుకున్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

## విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

-ఎమ్మెల్సీ అంజిరెడ్డి



వైద్యసేవలపై రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**నర్సాపూర్, జూన్ 1, ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదరోగులకు మెరుగైన, నాణ్యమైన ఉచితవైద్యసేవలు అందించడమేలక్ష్యంగా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని వివిధవార్డులను సందర్శించి, అందుతున్న వైద్యసేవలు, మందులలభ్యత, పారిశుధ్య నిర్వహణను ఎమ్మెల్సీ పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో, వారి సహాయకులతో ఆయన స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బిజెపి మెదక్‌జిల్లా అధ్యక్షులు వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బచ్చేష్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళియాదవ్, ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్, స్థానిక నాయకులు, ఆసుపత్రి వైద్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా గొర్లిల్ల ప్రభాకర్



నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

**సదాశివపేట, జూన్ 1, ప్రభాతవార్త:**
జహీరాబాద్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గొర్లిల్ల ప్రభాకర్‌ను సదాశివపేట బిజెపినాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉల్లిగడ్డల నాగరాజు, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు పవన్‌కుమార్‌గౌడ్, మఠం రాచన్నస్వామి, దోనూరు పాండురంగరెడ్డి, తాలేముల ఈశ్వర్ తదితరులు ప్రభాకర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ

-ధాన్యం కొనుగోలు ప్రక్రియను నాలుగురోజుల్లో పూర్తిచేయాలి
-జిల్లా అదనపు కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి



చిన్నచింతకుంటలో ధాన్యం అంజిరెడ్డి తదితరులు

**నర్సాపూర్, జూన్ 1, ప్రభాతవార్త:**
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధ్యానం కొనుగోలు ప్రక్రియ నాలుగురోజుల్లో పూర్తిచేయాలని ఎమ్మెల్సీ డా.చిన్నమైల్ అంజిరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నర్సాపూర్‌లోని చిన్న చింతకుంటలోని ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి వారిసమస్యలు అడిగి తెలుసుకున్నారు. 20 రోజులుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన ఇంతవరకు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈక్రమంలో వెంటనే జిల్లా అదనపుకలెక్టర్ నగేష్‌తో ఫోన్ మాట్లాడుతూ వచ్చే నాలుగురోజుల్లో రోజుకు నాలుగు లారీలచొప్పున పంపించి ధాన్యంకొనుగోలును పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలుచేయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అంతేగాక వర్షం వస్తే ధాన్యం తడిసిపోయి రైతులకు ఎంతగానో నష్టం కలుగుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి వెంటనే నాలుగురోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ బచ్చేష్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళియాదవ్, ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.